కథ:

"చీకటోళ్లు"

—అరుణకుమార్

ఒరే సత్యం. ఓసారి జైలు చూదివద్దాం అన్నాడు రామారావు. సరే పద అని జైలుదగ్గర కెళ్ళాం.

ఏమిటది? రామారావు.

జైలుగోడ.

అంటే ??

నిరపరాధుల్నీ, దేశభక్తుల్నీ, దోపిడిని వ్యతిరేకించిన వారినీ. దోపిడీకి గురయి మూల్గులు పీల్చివేయబడుతున్న పేదల ఆశల. ఆశలగొంతుల. గొంతుల కేకల— కేకల మానవతా పవిత్ర మూర్తులనూ- దోపిడీని ప్రశ్నించటం నేరమనీ, తమపాలన కద్దు వుండరాదనీ-ధనిక మదాంధులు బంధించినది— ఈగోడ వెనకాతలే. ఈగోడ న్యాయానికీ అన్యాయానికీ, స్వాతంత్ర్యానికీ పీడనకూ సరిహద్దు. ఈగోడ చీకటికీ వెల్తురికీ మధ్య పగలనికోట. ఈగోడను కట్టినదీ— అందులో బందీలయినదీ— వాళ్ళేవాళ్లే నిరపరాధులు. నిర్భాగ్యులు నిర్భాగ్యులే. కూటికోసం కూలీలు గోడలుకట్టారు. కూలివాళ్ళ కూలి చాల దన్నవాళ్లకూ ఆ గోడల వెనకాతలే గోరీలు కట్టబడ్డాయి.

ఈగోడ లెన్నాల్టివి!? రామారావు సందేహం.

అలనాడు అడవిలో జనమంతా బట్టల్లేకుండా నగ్నంగావుండి, శ్రమకు దొరికింది తలాకాస్తంత తిన్ననాడు లేవు, లేవీగోడలు. దొరికిన ఆహారం సమానంగా తీసుకొన్న నాడు లేవీగోడలూ— గోడల వెనకాతల నీడలూ— వానిజాడలూ. అన్నీ- అన్నీ స్వంత ఆస్తితోనే ప్రారంభమయ్యాయి. వున్నవాడికీ లేనివాడికీ మధ్య గోడల్లేచాయి. లేనివాడు "బానిసచాకిరీ ఎన్నాళ్ళని" అడిగితే గోడవెనకాతల వేయబడ్డాడు. బందీలయిన బానిసల మధ్య ఆ మరణపోరాటం యజమానుల వినోదంగా వుండింది ఒకనాడు. బానిసలనేమ యినా చేసేందుకు యజమాని కనుసన్నచాలు. తరువాత తరువాత రాజుగారి ఆజ్ఞతో— ధర్మపాలనకోసమనీ, ప్రజారక్షణకనీ, దేవుని ఆజ్ఞ కారణమనీ— రాజ్యపు పునాదులు పెకిలించి వేయబడకుండా కాపాడేందుకు— ఆకలి జనత గొంతులు మూసేందుకూ,—

చీకటికొట్లు— పాతాళగృహాలు— ఒంటిద్వారాలు— ద్వారాలకు రాని తాళాలు- నోరులేని తాళాలకు నోరుతెరువని భటుల కాపలాలు— ఇవన్నీ అనాడు.

మరినేడో ??

న్యాయాన్నీ ధర్మాన్నీ పెట్టుబడినీ, ధనికవర్గాల్నీ కాపాడేందుకు కోర్టులు- విచారణలు- శిక్షలు- కడకు పేదల గొంతులకు గోడల వెనకాతల ఉరితాళ్ళు.

గోడలలోపల మరేమిటున్నది ??

చిన్నకొట్లు- పెద్దకొట్లు— చిన్నచీకటి, పెద్దచీకటి, చిన్నతాళం పెద్దతాళం, చిన్నవి పెద్దవి— చిన్నవి పెద్దపెద్దవి— దేశాన్నీ- స్వాతంత్ర్యాన్నీ మింగివేసేంతవి— చీకటిగదులే నాయనా- చీకటిగదులే.

జైలులో ఇంకా ఏమున్నది ??

చువ్వలకొట్లు చువ్వల వెనకాతల చీకటి. చువ్వల్లోంచి చీకట్లోకి సన్న సన్న వెలుగు. అ చీకట్లో వెలుగులో వాళ్ళే సన్నసన్నబడిన జీవాలు.

అదుగో కాలికి కడియంతో ఎవరో ఖైదీ- మిగతావాళ్ళతో జైలుబయట ఖభ్రిం చేయిస్తున్నాడు- అతనికథేదో అడుగుదాం పద

నీపేరు ?

మల్లేసు.

జిల్లా ?

ఆదిలాబాదు.

ఏం కేసు ?

మర్డర్ కేసు.

ఎవరిని ?

ఇంకెవర్ని ?— మా భూసామినే.

మల్లేసూ— ఇంద- ఈ సిగరెట్టు కాల్చుకో— అసలు మొదట్నుండీ ఏం జరిగిందో నీగొడవంతా వివరంగా చెప్పు వినాలనివుంది.

మేం నల్గురం అన్నతమ్ములం ఒక్కతల్లికి. ఎవల్లమాల్లం ఏరుపడ్డం. నేను కడపోడ్ని. ఓరోజు నేను జంగిల్‌కెల్లి కట్టెలుతెచ్చినా. పొద్దీకి బండిడిసినా, నాభార్య సెప్పింది. ఇల్లాగ ఇల్లాగ బావను బూసామి కొట్టిచ్చిండని. అమ్మా [illegible]వాల్లని— ఏందే అమ్మా ఏటి జరిగిందంటే ఎవల్లూ సెప్తల్లేదు. అన్న ఏడుత్తున్నడు. ఓరినియమ్మ-

303

గొంతదానికి ఏడుత్తవేం మగాడివి- సప్పుడు సేయకవూరుకో పగలుసూద్దం అని పెద్దన్నకాడికెళ్లేను ఆడు సర్పంచితోటీ, పోలీసోడితోటీ సెప్దమన్నడు. మనకాడ పైస ల్నేవు- కోడిపెట్టల్నేవు- అందుకని సర్పంచిలేడు- పోలీసోడులేడు- సప్పుడుసేయకు మని- మన్నాడు పొద్దుటేల అడివినుండి తెచ్చిన బండికట్టెలూ- సంతలో అమ్మేసినా, వచ్చిన తొమ్మిది రూపాయలూ ముడుపునగట్టి నే బండెనకాలవత్తన్నా, బండినేమొ నాటు బండల పోరగాలు తోల్తన్నరు, ఆయేలప్పుడే బూసామి గుమాస్తా బండెదురుగా వత్తన్నాడు నడిరోడ్డుమీన. ఆకలిపేనంమీన వున్నయ్యేమొ కోడెలు బుసలుకొట్టినయ్. ఆడు బయంపడి తప్పుకొన్నడు. పోరగాళ్లు గుప్పుమని నవ్వేసినారు. ఆడు మండిపడి "కొవ్వు పట్టిందేటిరా లంజకొడకా- మీదకితోలింతన్నావు" అనీడండి. అదుగో ఆ ముతకమాట మల్లీ అంటివంటే మక్కెలిరుగుతాయని సెప్పాను." అప్పుడు ఆడు "నీయమ్మ లంజ- నీయమ్మమ్మ లంజ ఏంసేత్తావురా పకీరునాయాలా" అనీడండి. నాయన్నాయనా ఓకోప మొచ్చిందండీ- అన్నెం పున్నెం ఎరుగని అమ్మని అన్న లంజకొడుకొని మరింక సెమించకూడదని- సేతికర్రతో ఆడిని సితకబాదేను. నాయాలు పంచె వొడిపోతన్నా పారిపోయేడు. ఆగొడవ ఆడతోసరి. మరికొన్నాల్లు పోయేక అన్న బండి తోలుక వత్తంటే బండలడ్డుపెట్టేరు బూసామి మనుసులు. అన్నబండి వొగ్గేసి వురికొచ్చిండు. అందరం ఎల్లి బండితోలుకొచ్చేసినాం.

నాల్నెల్లు పోనాక సేలోవున్న నాగండ్లను (మావి మూడు; పిళకాయనివి రెండు) ముక్కలుసేసి బురదలో తొక్కేసినారు బూసామి మనుసులు. పొద్దున్నే ఎవడు సేసింద్రా ఏటిసంగతని. వూరు పబ్లీకంతా గుమస్తా ఇంటిమీనకే పోయినాం. ఆతొత్తు కొడుకు పారిపోయిండు. పొలమంతా గాలిచ్చగా గాలిచ్చగా నాగళ్ళముక్కలు దొరి కాయి. ఇది జరిగిన నెల్లాళ్ళకు పొలం దున్నుతావుంటే- కోడెదూడకు జబ్బయినాది, కోడెపాణం మంచిగలేదని జోడుని అక్కడ్నేవదలి- ఆల్లు సెప్పిన మందూ- ఈల్లు సెప్పినమందూ ఎతికితెచ్చినా. ఇంతలోకి రెండోదూడ గూడా కుంటుతావుంది. ఏందిరా దేముడా అనిసూత్తే దాని కాలినిండా రగతం రగతం- ఈపంతా దెబ్బలేదెబ్బలు, సుట్టూ సూత్తే పక్కపొలంలో బూసామి మీసకట్టు దువ్వుతున్నాడు. గుమాస్తా ముసిముసిగా నవ్వుతున్నాడు. ఏటి ఈపని అని ఆడిగితే- గట్టుదాటి నాపొలంలో అడుగేత్తే నీపనీ అంతేననీరు. నోరులేని ఎద్దు- గట్టుదాటిందీ లేనిదీ ఎవడికెరిక ?? ఒకటికి రెండెద్దులూ మూల్నపడ్డాయి, నానడ్డిరిగిపోనట్లయినాది. ఎన్నాల్లనుండో నన్నప్పులపాల్జేసి నానేలనీ కలిపేసుకోవాలన్న బూసామి పన్నాగంగ మనానికొచ్చినాది. మరిప్పుడు ఒంటిగాడ్ని సప్పుడు సేయగూడదని- ఇంటికెల్లిపోనాను.

304

ఆరాత్రి- సీకటిదొరల దలం మా వూరొచ్చినాది. మకాం నాయింట ఏసినారు. గంత గంజిపోసినా తాగినారు. ఆనక బూసామిగాడి దుర్మార్గాలన్నీ సెప్పినా. రాసుకొన్నారు పుస్తకాల్లో. పేదరైతులకంతా ఫిలిపించినారు. అన్ని జిల్లాలలోనూ పేదలంతా ఇలాగే దోచుకోబడుతున్నారని చెప్పారు. మన పేదోళ్లంతా. ఒక కంచెబద్దలాగా- ఒకే కట్టుమీన వుండాలని సెప్పినారు. తొందరపనిమీన పక్క జిల్లాలోకెళ్తన్నాం. మళ్లీ కొద్దిరోజుల్లో వచ్చి, సంగం పెట్టుకొని- సంగంద్వారా ఆడిపనిబడ్దాం. అందాక జాగరత్తగ బూములు దున్నుకోండని సెప్పి ఎల్లిపోనారు. మర్నాడు పోలీసుపటేలు బూసామి ఇంటికాడకి పిలిపిచ్చేడు. సీకటోళ్లని జేరనిత్తే- తలదీత్తానన్నాడు పటేలు ... సానాసేపు సానాసాన బయంమాటలు సెప్పినారు. అయితే అస్సలుమాట- బూసామిది, అదేటంటే– "ఏటిరా సీకటోళ్ళకు అన్నవేఁనా లేక ఆడదాన్నీ అప్పసెప్పినావాః అదేదో నాటోటోడికో- పటేలుగారిలాటోడికో అయితే నీబతుకు బావుంటది. ఆళ్ళేటిత్తారునీకు. జెల్లలూ- సీకటికొట్లూ తప్ప" అనీడండి. మరి దురుమార్గపు తొత్తుకొడుకు లిద్దరూ కూడినారుగదా నాబంలేదని సప్పుడుసేయక వచ్చేసినాను.

ఆ మరునాడు, ఆ మరునాడే సేలో బూసామి నా ఆడదాని సేయట్టుకున్నాడు. అది ఇడిపించుకొని ఇంటికొచ్చేసి- "నా సేయన్నాకోసేయి– నేదా ఆడితలేనా తీసేయి- నేదునేదంటే మరో పరువున్న మనుఁవు సూసుకుంటానన్నది". "హాఁ నే బతికుండగానే మరోమనుఁవా? నే బతికుండగానే బూసామి అలనాడు ఆడన్నంతపనీ సేత్తాడులా వుంది. మరింక సీకటోళ్లగురించి ఆగితే నాబంనేదు- నేదని. పిచాకు జేబులో ఎట్టుకొని పడుకొన్నా. అమెన్‌టానా (పోలీసు స్టేషన్)కు దొరకకూడదనీ ఆలోచన సేసినా. రాత్రికిరాత్రే బూసామిని ఖతంచేసినా. నెత్తురుదెచ్చి ఆడదానికి తిలకంపెట్టేసి జంగిల్‌లోకి పారిపోనాను. మరుసటిరోజు అన్నలందర్నీ ఆరెస్టుచేసినారని తెలిసి- నేనే అమీనుసాబు దగ్గరకెల్లి. సంపింది నేను- నన్నుకొట్లో ఎట్టి- అన్నల్నీ వొగ్గిమన్నాను. అట్లాగేనన్చెప్పి అన్నలతో నన్నూ లాకప్‌లో తోసిండు.

మరుసటిరోజు బూసామికొడుకు ఏయిరూపాయలిచ్చి- అందర్నీ ఇఁకించమనీడు. ఆయాల సాయంతరం. నలుగుర్నీ బయటికొగ్గేసి పరసనే నించోమనీరు. నాలుక్కట్టెలిచ్చి తలకొకటీ పట్టుకోమనీరు. పొటోలమీన పొటోలు లాగేసినారు. డాకటేరుగూడ చినాకత్‌సేసీ కట్టెలదెబ్బలకే సచ్చినాడని రాసినాడు. అమీను సుతారిపనోళ్లని పిలిచి– ఈళ్ళని కోర్టులో గుర్తుపట్టాల బాగా సూడమని సూయించినాడు. ఆనక వరంగల్లు కోరుటుకంపినారు. అక్కడ సాలెకోటయ్య, పోలీసుపటేలు. నూకల భీమయ్య, అడి

కొడుకే దుర్గయ్య. మరి.... వోలేటి బుచ్చం- అంతా సంపటం సూసినామని గవాయి సెప్పేరు. ఈళ్ళంతా మావూరి వాళ్ళు కానేకాదు. అయినా గవాయి ఇచ్చేరు. జడిజీ- పెద్దాయనో మరి చిన్నాయనో బరబరా రాసేసుకున్నడు. ఆకోరుటు తంతు అయిపోనాక జడిజీబాబు- మీమీద నేరం రుజువయింది. అందరికీ సిక్సలేత్తున్నా. ఏటన్నా సెప్పు కుంటే సెప్పుకోమనీడు.

మరెలాగూ సిక్సలేత్తున్నాడని సెప్పినా.

జడిజీబాబూ! పేదోల్లం. సంపినాది నేను. ఆడి అన్నాయాల్ని బరించలేక సంపిన మాట నిజమే. మరి మీతీరుపులో వాడి అన్నాయాల గొడవేనేదు. నేకపోగా ఆడి అన్నాయాల కారణంగా ఆడుసత్తే- నాసంసారాన్నీ- అన్నలు ముగ్గురి సంసారాల్నీ ఎండపాలు సేయవద్దన్నాను. అమ్మ, అయ్య- ముసలాళ్లు- మట్టిలో బంగారం పిండి మమ్మల్ని పెంచినారు. వయసుమీన పడివున్నారు. వాల్లకి కూడేసేటందుకు- మా అందరి పెల్లాల మానాలేన్నా బూసాముల బారినుండి కాపాడేందుకు. ఒక్కడ్నేనా ఒగ్గేయమన్నాను. మా పిలాల్నీ, పెళ్ళాల్నీ బూసామి కప్పజెప్పి మమ్మల్ని కొట్లో ఏయటం అన్నాయం బాబూ, నీకాల్మొక్కుతా ఒక్కడ్నంటే ఒక్కడ్నేనా ఒగ్గేయ మన్నాను.

ఏటో గీకేసుకొని- నలుగుర్నీ జీయితకైదు నెట్టేసి ఎల్లిపోనాడు జడిజీబాబు.

అమ్మ, నాలుగెకరాలమ్మి- పట్నంలో బారిట్టరు నెట్టివాదించినా పైకోర్టూ-కిందిదే ఖాయమందట. నాయం పైనా, కిందా ఒక్కనాగేవుంది. మరేంసేయాల. లోపల మేం కుల్లిసత్తన్నాం. బయట ఆళ్లు మాడిసత్తన్నారు. అదిబాబూ సంగతి. అయితే తండ్రీ దరమదాతగందా జడిజీబాబు మరదేఁటి, అలాగ సిక్సలేసినాడు. ఈ నేలమీన పుట్టిం దగ్గర్నుంచి సచ్చిందాకా సాకిరీసేత్తన్నాం. బంగారపు దాన్నెపుగింజలు పండిత్తన్నాం. మేం గంజినీల్లుతాగి- పట్నపుబాబులకి గింజలంపుతున్నాం. దేశమంతా తినేది నాటోటోడు నాటోటోడు రెక్కలు ముక్కలుసేసి పండించిన పంటలేగందా! మరి మాకుగాని నాయం అదెలాంటి నాయం? నాకు ఏతావాతా తేలిందేటంటే- ఈ రాజ్జెంలో మా బూములు, గేదెలు, మావికావనీ- మా సంసారాలకు రచ్చనలేదనీ- ఎర్రటోపీలూ- బూసాములూ- జడిజీలూ మాకు నాయం సెప్పరనీ- అన్నాయం సేత్తారనీ- మా కట్టాల్ని ఇనుకొనేదీ, మమ్ములను కాసుకునేదీ, మాకు సరయిన నాయంసెప్పేదీ, మా బతుకుల్నోదరిజేర్పేదీ-

306

మానేల మాకప్పజెప్పేదీ- అళ్ళ- అశ్లేబాబూ- ఇందాకల సెప్పేనే- మా గంజినీల్లతో మాకన్నీల్లు తుడిసేందుకు ఆయాల వచ్చిన సీకటోళ్ళే. అన్నాయానికీ, దొంక గవాయిలకీ, దురుమార్గాలకీ అళ్ళే సరయిన సమాదానం సెప్పాల. ఈయేలకాకుంటే రేపయినా- అన్నమాట పెకారం సీకటోళ్లు రాకమానరు, దురుమార్గపు నాయాళ్ల పనిబట్టకమానరు. ఆయాల మా రైతులంతా సుఖపడకా మానరు. ఆయాల మానేల మేమే ఏలుకొంటాం. అందువలన సీకటోళ్లంటే బూమాతబిడ్డలు. అళ్ళు సల్లంగావుంటే నాలాటోళ్లకేటిదిగులు బాబూ. రాజ్జెమే మారిపోతది. నా ఏదాంతానికేటిగాని మారాజా- ఏళయింది. మరి సెలవని వెళ్ళిపోయాడు.

ఒరే సత్యం కొంచెం బుర్ర వేడెక్కింది. ఇంక జైలుగోల చాలుగానీ- కాసింత కాఫీ తాగుదాం పదమని బయటికి లాక్కొచ్చాడు రామారావు. కాఫీ తాగుతుండగా రామారావు ప్రశ్న. ఒరే చీకటోళ్ళని దొరికినచోటల్లా కాల్చిపారేస్తున్నారుగదా? మరి మల్లేసులాటోళ్ళ ఆశలేమవుతాయి? వీళ్లగతి ఏమవుతుందంటావు?

ఏమవుతుంది? ఆకలి సృష్టించబడింది. దానికి పుట్టేది ఒక్క టేబిడ్డ- అదే విప్లవం! అందాకా చాలా రిహార్సల్సు జరుగుతాయి. అందువలన రిహార్సల్సుకే భయపడకు. ఇంకా ముందున్నది సూర్యోదయానికి వేళ. ఆనాడు అడవుల్నుండి అవనికంతా నిర్మల నెత్తుటిమడుగులు దాటి సత్యంమార్గాన భాస్కరుని వెల్గుల వేగంతో వస్తాయి జగన్నాధ రధచక్రాలు- కనిపించటం లేదా.

అడవుల్లో చీకటి కనుమాటున కదులుతున్న నీడల కదలికలు- జాతికి కొత్త నెత్తురూ రేపటి యువకాశల ఎర్రజ్యోతులూ- నేటి కుష్టువ్యవస్థను కడిపి కుదిపి నిలవేసి, శిక్షించి శాసించే చీకటోళ్ళు రధసారధులైవున్నారు. వాళ్ల పేదల కన్నీటిని తుడుస్తూ, శత్రువు బారినుండి తప్పుకుంటూ- తమ రక్తంతో తడిపి తమ మార్గాన్ని ఎంచుకొని భరత భూమినంతా ఆక్రమించగలిగే ఆ క్షణంకోసరమే మల్లేసులాటోళ్ల ఆశలన్నీ.

"పెద్దమనుషుల్లోవుండే స్వార్థం, సంకుచితత్వం, అసూయ నైచ్యం, ద్రోహబుద్ధి నికృష్ట మానవులనబడేవాళ్ళలో కనిపించవు."

—గోర్కీ—

307